
వనం నాగయ్య, కెరటం న్యూస్ ప్రత్యేకం




# కల్యాణం కమనీయం

## భూలోక స్వర్గంలా తపన్ చేతక్, నికిత పరిణయ వేడుక

తన ప్రాణాలే నీవని ధర్మేచ్ఛగా.. తన మనసంతా నీదని అర్ధేఛగా... తన వలపంతా నీకని కామేఛగా.. అవధుల్లేని ప్రేమకై మోక్షేఛగా..మూడు ముళ్లతో ఏడడుగులతో.. వేలాది మంది అతిరథ మహారథులు కన్నార్పకుండా కల్యాణ తంతును వీక్షిస్తున్న వేళ అగ్నిసాక్షిగా కమర్తపు తపన్ చేతక్, నికిత నవ దంపతులు ఇరువురూ ఒక్కటైన క్షణాలు మరచిపోలేని అనుభూతిని కలిగించాయి.. స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ విశ్వావసు నామ సంవత్సర కార్తీక మాస బహుళ విదియ శుక్రవారము తేది 07-11-2025 రోజున ఉదయం గం 10:41 నిమిషాలకు రోహిణి నక్షత్రయుక్త ధనుర్ లగ్న శుభ పుష్కరాంశ సుముహూర్తములో హైదరాబాద్ సాయి నగర్ హిందీ నగర్ ఇందిరానగర్ కాలనీలోని శ్రీ పళని కన్వెన్షన్స్ కళ్యాణ వేదికగా వివాహం వైభవంగా జరిగింది. ఖమ్మం నగరానికి చెందిన (కీ శే శ్రీ కమర్తపు నరసింహా స్వామి శ్రీమతి బతుకమ్మ మరియు శ్రీ కూరపాటి వెంకటేశ్వర్లు శ్రీమతి హైమావతి గార్ల మనుమడు), ఖమ్మం 24వ డివిజన్ కార్పోరేటర్ శ్రీ కమర్తపు మురళి సరిత ఏకైక కుమారుడు చి.తపన్ చేతక్, (హైదరాబాద్ వాస్తవ్యులు శ్రీ బోగా రమేష్ శ్రీమతి శాంతి గార్ల పుత్రిక) నికిత వివాహం కన్నుల పండువగా జరిగింది. వేలాది మంది బంధువులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు, రాజకీయ, సామాజిక రంగాల ప్రముఖుల ఆశీస్సులతో, అశేష జనుల హర్షధ్వానాల నడుమ పెండ్లి పుస్తకంలో మరిచిపోలేని సంతకం చేసిన నవ దంపతులు కమర్తపు తపన్ చేతక్, నికిత ఇరువురూ.. మరు జన్మకు తొలి స్వాగతం పలికారు... శ్రీరస్తు శుభమస్తు అంటూ శ్రీకారం చుట్టుకున్న వారి వివాహ వేడుక ఇల వైకుంఠంలా కనీవినీ ఎరుగని రీతిలో జరిగింది.

**భూలోక స్వర్గంలా పరిణయ వేడుక....**

నెల రాజును.. ఇల రాణిని కలిపింది కదా ఈ పరిణయ వేడుక అనేలా తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని ఇందిరా నగర్ లోని 'శ్రీపళని కన్వెన్షన్' కల్యాణ వేదికగా పసిడి కాంతులతో,



మిరుమిట్లు గొలిపే విద్యుత్ వెలుగుల్లో 'నభూతో నభవిష్యతి...' అనే రీతిలో సాగిన తపన్ చేతక్, నికిత పరిణయ వేడుక చూడటానికి రెండు కండ్లూ చాలవా అన్నట్టుగా నయనానందంగా సాగింది. ఒక్క మాటలో చెప్పాలంటే మూడు ముళ్ల బంధంతో ఏకమైన ఆ నవ దంపతుల కల్యాణ మహోత్సవం 'శ్రీ పళని కన్వెన్షన్' ప్రాంగణమంతా భూలోకంలో ఉన్నామా..? స్వర్గంలో ఉన్నామా..? అన్నట్టుగా మనసుదోచుకుంది. కల్యాణ గడియలు సమీపిస్తున్న తరుణంలో సాంప్రదాయ పద్ధతుల్లో మేళతాళాలతో, బంధుమిత్రుల అలుపెరగని నృత్యాలతో ముందు నడుస్తుండగా వరుడు, పూల పల్లకిపై వధువు పెళ్లి పందిరిలోకి తరలివచ్చిన నవ దంపతులను చూసిన ప్రతీ ఒక్కరూ మైమరచిపోయారు. వేదమంత్రాలు, అగ్నిసాక్షిగా జరిగిన వివాహ మహోత్సవానికి వేలాదిగా తరలివచ్చిన బంధువులు, స్నేహితులతో 'శ్రీ పళని కన్వెన్షన్ సెంటర్..' రంగు రంగుల పట్టు వస్త్రాలు అలంకరించుకున్న యువతీ యువకులు, బంధువుల సంబరాలతో సందడిగా మారింది.

**వేదమంత్రం అగ్ని సాక్ష్యం..**

శ్రీరస్తు, శుభమస్తు అంటూ శ్రీకారం చుట్టుకున్న కమర్తపు తపన్ చేతక్, నికిత దంపతుల పెండ్లి ఇల వైకుంఠమె మళ్లీ అన్నట్టుగా సాగింది. అందాల అపరంజి బొమ్మ నికిత పడిసికాంతులతో దేదీప్యమానంగా వెలుగొందుతున్న బంగారు కల్యాణ మండపంలో సిగ్గుల మొగ్గైన నికిత మెడలో సుగుణశీలిగా తపన్ చేతక్ తాళి కట్టిన క్షణాన అసలైన వేడుకను వేలాది మంది కరతాళ ధ్వనుల నడుమ ఇరువురూ ఒక్కటయ్యారు. వేదమంత్రంతో అగ్ని సాక్షిగా జరిగిన ఈ మహా వేడుకలో పసుపు కుంకాలు, పంచ భూతాలు కొలువైన మండపాన బ్రహ్మముడి వేసి జతకలిసిన క్షణాలు అనిర్వచనీయమని చెప్పక తప్పదు. వేద పండితులు, పెద్దలు నిశ్చయించిన కల్యాణ గడియల్లో చూడముచ్చటగా జరిగింది.

**తరలివచ్చిన అతిరథ మహారథులు..**

శ్రీ పళని కన్వెన్షన్ లో శుక్రవారం జరిగిన ఖమ్మం 24వ డివిజన్ కార్పోరేటర్ కమర్తపు మురళి సరిత ఏకైక కుమారుడు, ప్రముఖ పీడియాట్రిక్ వైద్య నిపుణులు, తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు డా. ప్రదీప్‌కుమార్ కూరపాటి గారి స్వయానా మేనల్లుడు చి.తపన్ చేతక్-చి"ల"సౌ" నీకీత వివాహ కార్యక్రమానికి ఖమ్మం, హైదరాబాద్ నగరాలకు చెందిన అనేక మంది ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ప్రధానంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సాధు రమేష్ రెడ్డి, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దుర్గాప్రసాద్, నవదంపతుల ఇరు వర్గాలకు చెందిన బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, వైద్యులు, న్యాయవాదులు, జర్నలిస్టులు, రాజకీయ, సమాజిక రంగాలకు చెందిన అనేక మంది ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.